క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఏ.కొండూరు: మండలంలోని వల్లంపట్ల గ్రామంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ జూపల్లి రాజేష్ శుక్రవారం తెలిపారు. ఎమ్మెల్యే కే రక్షణనిధి గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తారు. సమస్యలపరిష్కారానికి కృషి చేస్తారు. ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

బీఎస్ఎన్ఎల్ ఆస్తుల వేలంపై నిరసన

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని బీఎస్ఎన్ఎల్ ఎక్స్చేంజ్ ఆస్తుల వేలం నిర్ణయంపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. పూర్వం నుంచి ప్రజలకు సేవలు అందించిన ప్రభుత్వ సంస్థల ఆస్తులు ప్రధాని మోదీ తన మిత్రులకు కట్టబెట్టేందుకు కుయుక్తులు పన్నారని ఆరోపించారు. కొండపల్లిలో టెలిఫోన్ ఎక్స్చేంజ్ స్థలాలు వివిధ ప్రభుత్వ భవనాల నిర్మాణాలకు వినియోగించాలన్నారు. వేలం నిర్ణయం ఉపసంహరించా లని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు పాల్గొన్నారు.

వైభవంగా శాంతి కల్యాణం

ఆగిరిపల్లి: ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఆగిరిపల్లిలో స్వయంభూగా వెలసిన శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో స్వాతి నక్షత్రయుక్త వైశాఖ పూర్ణిమ సందర్భంగా శుక్రవారం శాంతి కల్యాణ మహోత్సవాన్ని దేవదాయశాఖ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. విజయవాడకు చెందిన ఎ.సత్యనారాయణ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

గోసవీడు(గంపలగూడెం): గోసవీడు విశ్వేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన గావించారు. పురోహితులు అరిపిరాల అప్పయ్య శాస్త్రి, అర్చక బృందం సంప్రదాయ బద్ధంగా పూజలు జరిపారు. దాతల సహకారంతో పునర్నిర్మాణ పనులను చేపట్టారు.

లోకోస్ యాప్‌పై శిక్షణ

ఆగిరిపల్లి: స్థానిక వైఎస్సార్ వెలుగు కార్యాలయంలో శుక్రవారం లోకోస్ యాప్‌పై వీఓఏలకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రామకృష్ణ మాట్లాడుతూ నెలవారీ సమావేశాల్లో జరిగే లావాదేవీలను యాప్‌లో నమోదు చేయాలన్నారు. లీగల్ కోఆర్డినేటర్ పి.ప్రసాద్, సీసీలు వెంకటరత్నం, లక్ష్మీ, అరుణకుమారి పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు లేవు

నూజివీడు: ఇటీవల వర్షాలకు కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు విరిగిపడటం, విద్యుత్ తీగలు తెగిపడటం వంటి కారణాల వల్ల విద్యుత్ సరఫరానునిలిపివేశామని, ఎలాంటి అప్రకటిత కోతలు లేవని ఏపీసీపీడీసీఎల్ ఈఈ డీ కృష్ణనాయక్ శుక్రవారం తెలిపారు. లైన్ల వెంట ఉన్న చెట్ల కొమ్మలను నరికేందుకు, కొత్త కరెంటు స్తంభాలు వేసేందుకు, ఇన్సులేటర్లు బిగించేందుకు రెండు గంటలు విద్యుత్ సరఫరా నిలిపామన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోండి

పుల్లేల (విస్సన్నపేట): రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాను వినియోగించుకొని గిట్టుబాటు ధర పొందాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దోర్నాల దామోదరరెడ్డి అన్నారు. మండలంలోని పుల్లేల గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కారుమంచి స్వాతి, సొసైటీ అధ్యక్షుడు భీమిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, వ్యవసాయ సహాయకుడు భిక్షాలు, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

వెల్వడం(మైలవరం): మండలం వెల్వడం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రైతులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా గ్రామాల్లోనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ తోట తిరుపతిరావు, డివిజనల్ అధికారి కిరణ్‌కుమార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సత్యనారాయణరెడ్డి, వెల్వడం సొసైటీ అధ్యక్షుడు, గ్రామ వ్యవసాయ సహాయకులు, సొసైటీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

వెల్వడం (మైలవరం): మార్క్‌ఫెడ్ ద్వారా మొక్కజొన్న కొనుగోలుకు ఈ క్రాప్ అయిన ప్రతి మొక్కజొన్న రైతు ముందుగా వారి గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మైలవరం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎమ్.శ్రీనివాసరావు తెలిపారు. నెలలో మొదటి శుక్రవారం జరిగే గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం మైలవరం మండలం వెల్వడం గ్రామంలో శుక్రవారం జరిగింది. ఏడీఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే ఖరీఫ్‌కు జీలుగ, పిల్లిపెసర, ధాన్యం ఇండెంట్‌లు పెట్టినట్లు సభ్యులకు తెలిపారు. 40 శాతం సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఐదుగురు రైతులు గ్రూప్‌గా ఏర్పడాలని, ఒకరు మాత్రం ఇంటర్మీడియెట్ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారిణి సంధ్యారాణి, గ్రామ వ్యవసాయ సహాయకులు సాయి శివరామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రం ప్రారంభ కార్యక్రమంలో అధికారులు, నాయకులు

మొక్కజొన్న రైతుల రిజిస్ట్రేషన్లు ప్రారంభం

ఇబ్రహీంపట్నం: గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోళ్ల రిజిస్ట్రేషన్‌లు ప్రారంభించినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి డి.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొక్కజొన్న సాగు రైతులు ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ ఆర్బీకేల వద్దకు తీసుకువెళ్లి వీఏఏల ద్వారా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలన్నారు. మొక్కజొన్న ఎకరాకు 32 క్వింటాళ్ల వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. క్వింటా ధర (ఎంఎస్‌పీ) రూ.1960 ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె పేర్కొన్నారు. ఈ అవకాశం మొక్కజొన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి కోరారు.

సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషం

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలో సంతోషం వెల్లివిరుస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని 32వ వార్డులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఇంటింటికి పర్యటించి నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. స్థానికంగా ఉన్న సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హత ఉంటే చాలని ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, డీఈ దాస్యం లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు నవుడు నాగమల్లేశ్వరరావు, దాసరి మారుఅప్పాజీ, క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఘనంగా గౌతమ బుద్ధుడి జయంతి

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో శుక్రవారం షిరిడి సాయి బాబా సేవా సమితి ఆధ్వర్యంలో గౌతమ బుద్ధుడు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి వివిధ రకాల పూజలతో భక్తులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ విశ్వమానవాళికి సహనాన్ని ప్రేమ తత్వాన్ని, అహింసను, శాంతిని పంచిన బుద్ధుని బోధనలు అందరూ అందరించాలన్నారు. ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేశారు. సాయిబాబా సేవా సమితి సభ్యులు పలుచూరు హరి మాధవ్‌గుప్త, బొలగాని రాజారావు, పాపయ్యమ్మ, మహిళలు పాల్గొన్నారు.



బుద్ధుని జయంతి కార్యక్రమంలో నిర్వాహకులు

బాలుడి ఆచూకీ లభ్యం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): తండ్రి మందలించాడనే కారణంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన 13 ఏళ్ల బాలుడి ఆచూకీ ఇబ్రహీంపట్నం పోలీసులు శుక్రవారం కనుకొన్నారు. గుంటుపల్లి ఖాజీపేటకు చెందిన సాలి విజయ కుమార్ తన కుమారుడైన సాలి అభిలాష్‌ను సక్రమంగా చదవడం లేదని మందలించాడు. తండ్రి మందలింపుతో అలిగిన అభిలాష్ ఈనెల 3న ఇంటిలో చెప్పకుండా వెళ్లిపోయాడు. తండ్రి పిర్యాదు మేరకు సీఐ పి.శ్రీను పర్యవేక్షణలో పోలీస్ బృందాలు గాలించి బాలుడి ఆచూకి కొనుగొన్నారు. స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

తిరువూరు: పోటీ ప్రపంచంలో విద్యార్థులు తమ నైపుణ్యం పెంపొందించుకోడానికి అవసరమైన శిక్షణ పొందాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్ సూచించారు. స్థానిక సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం విద్యార్థులకు జనవిజ్ఞాన వేదిక, భారత విద్యార్థి ఫెడరేషన్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. ఇంగ్లిషు గ్రామర్, స్పోకెన్ ఇంగ్లిషు నేర్చుకుంటే ఎక్కడికైనా వెళ్లి జీవించవచ్చన్నారు. జేవీవీ పట్టణ అధ్యక్షుడు పాపారావు ఇంద్రజాల ప్రదర్శన ఇచ్చారు. జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు రాంప్రదీప్, సుదర్శన్, నాగేంద్రప్రసాద్, వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ

చాట్రాయి: మండలంలోని చీపురుగూడెం గ్రామ శివారు మంగపేటలో నూతనంగా నిర్మించిన శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 5 వేల మందికి అన్నదానం చేశారు.

ఘనంగా కోదండ రామాలయ ప్రతిష్ఠ

చాట్రాయి: మండలంలోని జనార్దనవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామాలయ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 4 వేల మందికి అన్నదానం చేశారు. ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచ్ పామర్తి ఝాన్సీ, ఎంపీటీసీ పోతురెడ్డిపల్లి కృష్ణ, మాజీ సర్పంచ్ పామర్తి నాగేశ్వరావు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఖరీఫ్ సాగుపై సమావేశం

పుల్లేల (విస్సన్నపేట): ఖరీఫ్ వ్యవసాయ కార్యాచరణపై మండలంలోని పుల్లేల ఆర్‌బీకే వద్ద గ్రామ వ్యవసాయ సలహామండలి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఖరీఫ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై సలహామండలి సభ్యులతో చర్చించారు. కార్యక్రమంలో ఏవో రాజ్యలక్ష్మీ, వ్యవసాయ సహాయకుడు భిక్షాలు పాల్గొన్నారు.

నేడు మాస కల్యాణం

నెమలి(గంపలగూడెం): నెమలి శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి మాస కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు తిరునగరి గోపాలచార్యులు, అర్చక బృందంచే రుక్మిణీదేవి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం జరిపారు. 11 మంది దంపతులు కన్యాదానం చేశారు. కమిటీ చైర్మన్ కావూరి శశిరేఖ, సభ్యులు నూకల నాగలక్ష్మణరావు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

తిరువూరు: స్థానిక మధిరరోడ్డులోని స్వచ్ఛంద సంరక్షణ సేవా సంస్థలో శుక్రవారం దివ్యాంగులకు అన్నదానం చేశారు. మొండికుంటకు చెందిన ధరణి వితరణతో 40 మందికి అన్నదానం నిర్వహించినట్లు సంస్థ అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి ఎస్తేరు,ఏసు తెలిపారు.

రీ సర్వే పనులు వేగవంతం చేయాలి

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం నిర్వహణలో రీ సర్వే పనులను వేగవంతం చేయాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సర్వేయర్లను ఆదేశించారు. నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన వార్డు సచివాలయ కార్యదర్శులు, సర్వేయర్లు, రెవెన్యూ కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్ అమలులో నిబంధనల మేరకు వ్యవహరించాలని ఆయన ఆదేశించారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

చంద్రాల(మైలవరం): ప్రతి ఒక్కరూ ఆత్మ విశ్వాసంతో ముందుకు నడవాలని శ్రీ విరజానందస్వామి తెలిపారు. మైలవరం మండలం చంద్రాల గ్రామాన్ని శ్రీ విరజానందస్వామి శుక్రవారం సందర్శించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు, సర్పంచ్ జ్యోతి దంపతుల స్వగృహంలో పూజలు నిర్వహించారు. అనంతరం గంగాధరరావు ఇంటి వద్ద నుంచి స్వామిని పల్లకితో స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆశ్రమానికి తీసుకువెళ్లారు. ఆశ్రమంలో స్వామి భక్తులకు ప్రవచనాలు విన్పించారు. భక్తులను ఆశీర్వదించారు. ఆశ్రమ పీఠాధిపతి తుమ్మల శ్రీరామ్, భక్తులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో అధ్యాపకుడు ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ బి.రమేష్‌రెడ్డికి పీహెచ్‌డీ అవార్డు లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.అప్పారావు శుక్రవారం తెలిపారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో ది అఫెక్ట్ ఆఫ్ ఎక్స్‌పోనేన్షల్, కొసైన్ హైపర్ బోలిక్ అండ్ పాలినామినల్ విండో పారామీటర్స్ ఆన్ ది ఎస్.ఎన్.ఆర్ ఇంప్రూవ్‌మెంట్ ఆఫ్ ఎమ్ఎస్‌టీ రాడార్ సిగ్నల్స్ అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారన్నారు. ఈ పరిశోధన వలన సిగ్నల్ ప్రాసెసింగ్ అప్లికేషన్స్ ద్వారా భూ ఉపరితలంపై 20 నుంచి 100 కిలోమీటర్ల పరిధిలో వాతావరణంలో జరిగే మార్పులను తెలుసుకోవచ్చన్నారు. అవార్డు పొందిన రమేష్‌రెడ్డిని కళాశాల ప్రసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్, ఈసీఈ విభాగాధిపతి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

రాజీ మార్గమే.. రాజమార్గం

ఆగిరిపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్ఐ ఎస్.చంటిబాబు మండలంలో రాజీ పడదగ్గ కేసుల పరిష్కార విషయమై సిబ్బందికి శుక్రవారం తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రాజీ పడే కేసులు ఎదుర్కొనే వారికి, ఫిర్యాదుదారులకు నోటీసులు అందజేయాలన్నారు. కేసుల రాజీ కోసం కోర్టు సమక్షంలో రాజీ పడటం రాజ మార్గమని చెప్పారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు..

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వ్యాపారులపై చర్యలు తప్పవని ఎస్ఐ ఎస్.చంటిబాబు అన్నారు. ఆగిరిపల్లిలో అస్తవ్యస్తంగా ఉన్న ట్రాఫిక్‌పై ఎస్ఐ చంటిబాబు ప్రత్యేక దృష్టి సారించారు. గ్రామంలోని నూజివీడు-విజయవాడ ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణాలు, న్యూడిల్స్, జ్యూస్ దుకాణాలుండటంతో వాహనాలను రోడ్డుపైనే ఉంచడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్రంగా అంతరాయం ఏర్పడుతుందని ఆయా దుకాణాల వ్యాపారులు రోడ్లపై వాహనాలు నిలపనీయకుండా చూసుకోవాలన్నారు.

జెడ్పీటీసీకి సన్మానం

నూజివీడు: విద్యా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో గత కొన్నేళ్లుగా సేవలు అందిస్తూ ఇటీవల గౌరవ డాక్టరేట్ అందుకున్న ముసునూరు జెడ్పీటీసీ వరికూటి ప్రతాప్‌ను ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శుక్రవారం సన్మానించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో కలిసిన ప్రతాప్‌ను ఎమ్మెల్యే అభినందించి జ్ఞాపిక అందించారు. ఆగిరిపల్లి మండలం ఎంపీపీ గొళ్ల అనూష ఇటీవల ఏలూరు జిల్లా ఎంపీపీల సంఘానికి ఉపాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. దీంతో ఆమెను కూడా అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పిల్లా చరణ్, తుక్కులూరు సర్పంచి తొమ్మండ్రు బుజ్జి, మాజీ కౌన్సిలర్ కంచర్ల లవకుమార్, నాయకులు అత్తి మురళీ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన

మెట్టగుట్ట(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో గజలక్ష్మీ దేవికి శుక్రవారం మహిళలు సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు యోగానందాచార్యులు, శ్యామసుందరాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి వైశాఖమాసం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సిద్ధినేనిగూడెం, మధిర పట్టణాలకు చెందిన శ్రీనివాస భక్త బృందంచే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, కుంకుమార్చన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం గావించారు. ఆలయ కమిటీ చైర్మన్ జొన్నల ప్రతాపరెడ్డి, కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు.

చాట్ జీపీటీపై అవగాహన

మైలవరం: ప్రపంచం టెక్నాలజీలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఛాట్ జీపీటీపై ఒక రోజు వర్క్‌షాపు శుక్రవారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రవి మాట్లాడుతూ ఛాట్ జీపీటీ అన్ని రంగాల్లో విస్తరిస్తూ వినియోగదారులను ఆకట్టుకుంటుందన్నారు. టెక్ గురు ప్రతినిధి డి.సాయి సతీష్ మాట్లాడుతూ మనిషి మేధస్సుకుమించేలా అసలు మనిషికి మేధస్సే అవసరం లేకుండా కూడా చేసేలా ఉందన్నారు. కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ ఫాకల్టీ డాక్టర్ ఎన్.వెంకటాద్రి, పూర్ణ చంద్రావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

గంజాయి ముఠాపై కేసు నమోదు

జి.కొండూరు: బైకుపై గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకులపై జి.కొండూరు పోలీసు స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. ఎస్ఐ ధర్మరాజు తెలిపిన వివరాల ప్రకారం..జి.కొండూరుకు చెందిన ఒరుగు నవీన్‌కుమార్, మైలవరానికి చెందిన గరికపాటి శ్రీహర్ష, విజయవాడకు చెందిన చేగిరెడ్డి లోకేష్‌రెడ్డి అనే ఈ ముగ్గురు యువకులు గురువారం మధ్యాహ్నం సమయంలో బైకుపై గంజాయిని తీసుకొని మైలవరం వైపు వెళ్తున్నారు. సమాచారం అందుకున్న జి.కొండూరు ఎస్ఐ ధర్మరాజు సిబ్బందితో బైకును వెంబడించి జి.కొండూరు మండల పరిధి చెవుటూరు శ్రీవాణి ఇంజినీరింగ్ కళాశాల బస్‌స్టాప్ వద్ద గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. తహసీల్దార్ రోహిణీదేవి సమక్షంలో నింధితుల నుంచి కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ధర్మరాజు చెప్పారు. ముగ్గురు నింధితులను శుక్రవారం జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

11న ప్రవేశ పరీక్ష

రెడ్డిగూడెం: మండలంలోని మద్దులపర్వ ఆదర్శపాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి పరీక్ష నిర్వహిస్తున్నట్లు ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ ఏ వీరరాజు శుక్రవారం తెలిపారు. ఈనెల 11వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మద్దులపర్వ మోడల్ స్కూలులో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్హత ప్రవేశ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలకు చెందినవారు 2011 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి 2023 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 2021-22, 2022-23 విద్యా సంవత్సరంలో చదివి ఉండాలన్నారు. పరీక్ష రుసుం ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.75, ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.150 చెల్లించాలన్నారు. వివరాలకు ఆదర్శ పాఠశాల ఫోన్ 70757 73456, 82475 52027లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

చలివేంద్రాల ప్రారంభం

తిరువూరు: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో మంచినీటి చలివేంద్రాలను శుక్రవారం ప్రారంభించారు. సినిమా హాల్స్ సెంటర్లో, కృష్ణా థియేటర్ సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎస్ఐ సతీష్ ప్రారంభించారు. వాసవీ, వనిత, కపుల్, సీనియర్ సిటిజన్, యూత్ క్లబ్‌ల సభ్యులు జూలూరు వెంకటరమణయ్య, పవన్, నాగుబండి రాజు, ఎస్వీ రామారావు, దోసపాటి రవికుమార్, నాళ్ళా కృష్ణారావు పాల్గొన్నారు.

సచివాలయాల తనిఖీ

గంపలగూడెం: మండలంలోని తునికిపాడు, దుందిరాలపాడు, పెనుగొలను-2 సచివాలయాలను ఎంపీడీఓ వై.పిచ్చిరెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఆయా సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు, ఈ సేవ సర్వీస్‌లను సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సర్వే, ఆయుష్మాన్ భారత్‌కార్డుల సర్వేను పరిశీలించారు. సర్వేను వెంటనే పూర్తి చేయాలని సంక్షేమ సహాయకులు మహిళా పోలీసులు, గ్రామ వలంటీర్‌లను ఆదేశించారు.

దీపోత్సవం

గంపలగూడెం: స్థానిక షిరిడి సాయిబాబా ధ్యాన నిలయంలో పౌర్ణమి సందర్భంగా నందా దీపోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు బాబా విగ్రహాన్ని పల్లకిలో ఉంచి నందా దీపాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చే శారు. అనంతరం బాబా మూలవిరాట్‌కు ప్రత్యేక హారతి ఇచ్చి భజన కార్యక్రమం జరిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైలవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యు త్ మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రమేష్ తెలిపారు. ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మైల వరం గ్రామ ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లి 33/ 11కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జీబీ శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాజీపేట, రమేష్‌నగర్, బ్యాంక్‌నగర్, సాయినగర్, రామకృష్ణనగర్, రైల్వే వ్యాగన్‌వర్క్ షాప్, గణేష్‌నగర్, ఎస్టీ కాలనీ, గుంటుపల్లి తిరుమలశెట్టినగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.